
Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(4), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# రామభద్రాంబ జీవితం - సాహిత్యం

**యస్. విద్యాసాగర్,**
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
ఆత్మకూరు,
కర్నూలు (జిల్లా)
సెల్: 94410 82599

విజయనగర సామ్రాజ్యం అష్టదిగ్గజకవిపండితులతో సాహితీ స్వర్ణయుగం విలసిల్లిన తరువాత దక్షిణ భారతదేశంలో మళ్ళీ ఆస్థాయిని అందుకున్నది ఒక్క నాయకరాజుల కాలంలోనే అని చెప్పక తప్పదు. అయితే విజయనగర సామ్రాజ్యంలోని అష్టదిగ్గజాల్లో మహిళా మణులు లేరు, కానీ తంజావూరు నాయకరాజుల కాలంలో మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేశారని, వారి కాలంలో వచ్చిన సాహితీ గ్రంథాలను, గ్రంథ కర్తలను చూస్తే మనకు అవగతమవుతుంది. రఘునాథనాయకుడు తంజావూరు నాయకరాజులలో సుప్రసిద్ధులు. ఆయన ఆస్థానంలో ప్రముఖ కవయిత్రిగా పేరుగాంచిన ఒక మహోన్నత వ్యక్తి రామభద్రాంబ.

ఈమె తంజావూరు రఘునాథనాయకున్ని తన పతిగా భావించి, రచనలు చేసింది. ఈమె వివరాలు సాహితీలోకంలో అంతగా కనిపించవు. కానీ ఈమె గురించి సాహితీ జగత్తులో వారకాంత అని ప్రచారం కోకొల్లలుగా చేసినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. అయినా సాహితీకోణంలో ఈమెను అంచనావేసే ప్రయత్నం చేయడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

"రాజగోపాల విలాసము" రాసిన చెంగల్వ కాళయ, రామభద్రాంబ గురువు అని సాహితీ లోకంలో ప్రతీతి. ఈమె అష్టభాషా ప్రవీణురాలిగా సాహిత్యకారులతో కీర్తించబడింది. తాను రాసిన రఘునాథాభ్యుదయంలో ఈమె గురించిన వివరాలు ఒక గద్యలో వ్యక్తీకరించింది.

**"ఇతి శ్రీరామభద్ర కరుణా కటాక్ష లబద్ధసారస్వత ప్రవర్ధమాన**
**శతలేఖినీ సమయలేఖినీ యాష్టభాషా కల్పిత చతుర్విధ కవితాను**
**ప్రాణీత సాహిత్య సామ్రాజ్య పదపీతారూఢ రామభద్రాంబా**
**విరచితే రఘునాథాభ్యుదయే మహాకావ్యే ద్వాదశస్సర్గస్సమాప్త:"**

"శ్రీరామచంద్రమూర్తి కరుణా కటాక్షమున రామభద్రమ్మ కవిత్వము చెప్పనేర్చినది. ఆమె శతలేఖినీ విద్యయందును, సమయ లేఖినీ విద్యయందును చదురాలు. సంస్కృతము, ఆంధ్రము, ఆరు ప్రాకృతములు - ఈ ఎనిమిది భాషలందును చతుర్విద (గర్భ, బంధ, చిత్ర, ఆశు) కవిత్వము చెప్పగల ప్రజ్ఞాధురీణ అగుటచే ఆమె సాహిత్య సామ్రాజ్య పదపీతారూఢ". ఈ గద్యవల్లనే ఆమె సంస్కృతాంధ్రాది అష్టవిధ భాషలయందు అభిజ్ఞురాలని తెలుస్తోంది. ఈమె సంస్కృత భాషా వైదుష్యానికి

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(4), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

రఘునాథాభ్యుదయం ఒక ప్రబల నిదర్శనం.

విజయనగర కాలంలోని గంగాదేవి ఆమె భర్త వీరవిక్రమాలను, విద్యావినోదాలను కీర్తిస్తూ రాసిన “వీరకపంరాయ చరిత్రము” రాసిన విధంగానే రామభద్రాంబ కూడా రఘునాథనాయకుని గురించి, ఆయన పరాక్రమాలను గురించి సంస్కృతంలో ఎంతో అద్భుతంగా వర్ణిస్తూ ఈ కావ్యాన్ని తీర్చిదిద్దింది. ఈ కావ్యం గురించి ప్రముఖ సాహితీ పరిశోధకులు శ్రీ నిడదవోలు వేంకటరావుగారు “ఇందులో తొమ్మిదివందల శ్లోకములు కలవు. తృతీయ, దశమైకాదశ సర్గాంతములలో శార్దూల, మాలిని వృత్తములు, ద్వాదశమున స్రగ్దరయు గలవు. తక్కిన భాగములయందెల్ల రఘువంశమువలె నొకే వృత్తము వాడబడినది” అని ఈ కావ్యంలోని శ్లోకాల గురించి, వాటి సంక్యను గురించి, అందులో వాడబడిన వృత్తపద్యాల గురించి వివరించారు.

ప్రథమ సర్గలో రామభద్రాంబ రఘునాథనాయకుల కవితా శక్తిని, స్త్రీ విద్యాప్రియత్వాన్ని చాలా అద్భుతంగా వర్ణించింది. ఇందులో రఘునాథనాయకుడు క్షణానికి నూరు సమస్యలు పూర్తిచేయగల సమర్థుడుగా, లోకంలో విభిన్నమైన మనస్థత్వాలు కలిగిన వ్యక్తులగురించి తెలుసుకొని, వారిని అంచనా వేయగల సమర్థుడిగా కీర్తించింది. చెప్పుకోవడానికి కొంత అతిశయోక్తి అనిపించినా, తాను అత్యంత ఆరాధించే నాయకున్ని, కావ్యనాయకునిగా చేర్చడం వల్ల అక్కడక్కడ మనకు అతిశయోక్తి అనిపిస్తుంది. అందుకే

**“చింతా సమస్యా శతమేకఢైవ**
**తత్పూర్తి వార్తానహి వర్ణనీయా**
**అశేష లోకాశయవృత్త భేద**
**ప్రస్తార విద్యా ప్రథితన్య యన్య**
**అన్త:పురాన్తర్వరిణేక్షణాను**
**త్రిహాయణీ నామపి దీవ్య మానాన్**
**విలోక్యవిద్యావిభవా నఙస్రం**
**వశం వదాం యన్య వదంతి వాణీమ్”**

అని వర్ణించింది.

రఘునాథనాయకుని వంశవృక్ష వివరణం, ఆ తరువాత రఘునాథనాయకుడు యువరాజుగా ఉంటూ సాధించిన పరాక్రమాలను, రాచకార్యాలను ఈ కావ్యంలో వరుస క్రమంలో వివరించింది. పెనుగొండ రాజధానిగా విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న వేంకటపతిరాయలు గోల్కొండ నవాబులతో చేసిన యుద్ధంలో రఘునాథరాయలు విజయనగరసామ్రాజ్యం పక్కన నిలిచి, వారి విజయంలో కీలకంగా వ్యవహరించాడని, తుండీర మండలాధిపతి అయిన కృష్ణప్ప నాయకున్ని వేంకటపతి రాయల చెరనుండి విడిపించి, కృష్ణప్ప నాయకుని సోదరిని వివాహం చేసుకున్నాడని ఈ

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(4), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కావ్యంలో వర్ణించింది. మరోవైపు చంద్రగిరిలో రాజద్రోహి అయిన జగ్గరాయలను జయించి, అసలు రాజైన రామరాయలను సింహాసనంపై తిరిగి కూర్చోబెట్టిన ఘనత కూడా రఘునాథనాయకునికి దక్కుతుందని రామభద్రాంబ తన కావ్యాంలో పేర్కొంది.

రఘునాథాభ్యుదయం కావ్యంలో ఏకాదశ, ద్వాదశ సర్గలలో రామభద్రాంబ తన రాజైనటువంటి రఘునాథనాయకుని విద్యా వినోదాలను గురించి వివరంగా వర్ణించింది.

**“సుగంధి చూడార్పిత సూనమాలికా**
**వలీమిలిందారవ వన్ది నిస్వన:**
**విశామధీశో విజయోత్తరం తత:**
**ప్రమోదమానో భవనం సమాసదత్”**

అంతేకాకుండా

**“మహీభుజాం తన్మణిజాలకాంతికే**
**సహస్రధా మూర్తి యతీవ శారదా**
**అశేష విద్యావిభవాభి లక్షితా:**
**సహర్ష మేక్ష్యంతి సరోజలోచనా:**

అంటూ, ఆ సభలో ఎంతోమంది సరస్వతీ కటాక్షం కలిగిన అశేష విద్యావిభవాభిలక్షితలు అయి, ఆ భవనము నందు ఉన్న విదుషీమణులు, ఆ రాజుని సహర్షముగా సమీక్షణ చేసారంటూ, రఘునాథనాయకుని కొలువులో చాలామంది విదుషీమణిరాళ్ళు ఉన్నారన్న విషయాన్ని ఈ గ్రంథం ద్వారా తేటతెల్లం చేసింది. కొలువులో ఉన్న విదుషీమణులతో రఘునాథనాయకుడు విద్యావినోదాలపై సదస్సు జరిపాడంటూ అక్కడ కొలువులో జరిగిన విషయాలన్నింటినీ పూసగుచ్చినట్లు వర్ణించింది.

ఒక్క సాహిత్యం మాత్రమేకాదు, సంగీతంలోకూడా రఘునాథనాయకుని ఆస్థానంలోని విద్వాంసురాళ్ళు దిట్టలని పేర్కొనింది. అంతేకాకుండా వారు వాడే సంగీత సాధనాలైన “వీణ, హృత్కవిలలు, రావణహస్తము” మొదలైన వాటితో వారు మృదుమధుర గాణం చేశారంటూ వర్ణించింది. సంగీత సాహిత్యాలో ఈ విదుషీమణుల పాండిత్యాన్ని పరీక్షించి రఘునాథరాయలు వీరికి కనకాభిషేకం చేశాడని ఈ కావ్యంలో అక్షరీకృతం చేసింది. ఈ వర్ణనలను బట్టి రఘునాథరాయల ఆస్థానంలో సంగీత సాహిత్యాలలో అపర సరస్వతులు అనదగినవారు అనేకమంది ఉన్నారని, వారు రాజు ప్రశంసల్ని, సన్మానాల్ని అందుకొన్నారని రామభద్రాంబ కావ్యాన్ని బట్టి మనం అవలోకించుకోవచ్చు.

అయితే రామభద్రాంబ కేవలం సంస్కృత భాషలో రాసిన రఘునాథాభ్యుదయం ఒక్కటేనా, ఇంకేభాషలోనూ రచనలు చేయలేదా అంటే, చేసినట్లుగా చెప్పే కొన్ని పద్యాలు మనకు కనిపిస్తాయి. అయితే పూర్తిస్థాయి రచనలు ఇంకా లభ్యం కావాల్సి ఉంది. నాయక రాజుల కాలంలో తెలుగు భాషలో గొప్ప కవయిత్రి అయిన కృష్ణాజీతో సమానంగా రామభద్రాంబ కూడా కవిత్వం

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:3(4), March 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

చెప్పగలదు అని రఘునాథనాయకుడు చెంగళ్వకాళకవిని ఉద్దేశించి అన్నట్లుగా చెప్పిన పద్యం సాహితీ క్షేత్రంలో మనకు కనిపిస్తుంది.

**"అయ్యదినముల రామభద్రాంబవారు**
**నేడు కృష్ణాజి కవితచే నేర్పు మెఱ సి**
**కవిత సేయుట లెల్ల మీ ఘనతకాదె**
**కవివినుతచర్య! చెంగల్వ కాళనార్య!"**

అని చెప్పడాన్ని బట్టి చూస్తే, తెలుగు భాషలో కూడా ఈమె అసామాన్యంగా కవిత్వం చెప్పగల దిట్ట అని రాజు ఆమె గురువును ప్రశంసించడాన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

అంతేకాకుండా రఘునాథనాయకుడి కుమారుడైన విజయరాఘవనాయకుడు "రఘునాథాభ్యుదయం" యక్షగానంలో తన తండ్రి కాలంలో జరిగిన విద్యా వినోదాలు, కవయిత్రులు చేసిన సమస్యా పూరణాలు మొదలగు వాటిని వివరించాడు. దీన్ని బట్టి చూస్తే రఘునాథనాయకుని కాలంలో సాహిత్యంలో స్త్రీల ప్రాధాన్యత కనిపిస్తుండగా, రామభద్రాంభ రాసిన రఘునాథాభ్యుదయం సంస్కృత కావ్యంలో చెప్పిన ఉదాహరణలు దీనికి ఆధారంగా నిలుస్తున్నాయి.

"వేశ్యాంగన అనియు, ఈమె రఘునాథరాయల యుంపుడుకత్తె అనియు ప్రతీతి కలదు. తన కావ్యమున రఘునాథుని ఐదుగురు భార్యల పేర్కొని తన్ను పేర్కొనకపోవుటచేతను, పై శ్లోకమున రఘునాథుడు తన నాథుడని చెప్పుట చేతను ఈమె ఆయన ఉపస్త్రీ కానగునని ఊహింపవచ్చును. ఉపస్త్రీ ఐనను విద్వాంసురాలగుటచే ఈమెను అతి గౌరవభావముతో ఆనాటివారు చూచినట్లు కన్పట్టుచున్నది. రఘునాథరాయల కుమారుడు విజయరాఘవనాయకుడు ఈమెను 'రామభద్రమ్మవారు' అని గౌరవపూర్వకముగా పేర్కొనినాడు." అని శ్రీ కురుగంటి సీతారామయ్యగారు అన్న మాటలు రామభద్రాంబ సాహితీ పటిమను మనకు కళ్ళముందు నిలుపుతుంది. వారాంగనగా ఆనాటి సమాజం ఆమెను భావించినా, సాహితీపటిమతో అందరి ఆదరాభిమానాలను ఆమె సొంతం చేసుకొందని చెప్పడానికి, దక్షిణాంధ్రయుగ సాహిత్యంలో అమేయ సాహిత్య శక్తి సంపన్నురాలనడానికి ఎలాంటి సందేహం లేదు. సాహితీ విద్వత్తు వల్ల ప్రకాశించే నిత్య శోభితురాలు రామభద్రాంబ అని ఈ సందర్భంగా భావిస్తున్నాను.

## ఆధార గ్రంథాలు

1. యక్షగాన పారిజాతము – డా॥ పతికి రమేష్‌నారాయణ
2. రఘునాథాభ్యుదయం (సంస్కృతం) – రామభద్రాంబ
3. ఆంధ్ర విదుషీమణులు – ఆంద్ర శేషగిరిరావు
4. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము (మొదటి భాగం) – శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం